209108901

సకల శాస్త్ర పురాణ సంగ్రహవేత్తయ్యై
వేదాంత వేద్యుడౌ విప్రుడైన
రక్తియే పారగ రమ్య వాక్యంబుల
రమియించు రాచంద్రముడున్నైన
రణరంగమందు పరాభూత రిపుడౌచు
వెలుగొందు జగదేక వీరుడైన
దారిద్ర్యదేవతా దాక్షిణ్యమున నుందు
దౌర్భాగ్య నిధియగు దాసుడైన
ప్రేమ లేనిచో ఎందుకు పనికిరాడు
ప్రేమ రహితుడౌ యీ జగద్భర్తకన్న
ప్రేమ పరుడగు దాసుడే వంద్యుడగును
ఇంతకంటెను వేరొడ్డి ఎఱుకపరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార.

ప్రేమస్వరూపులారా!

ప్రేమగల మనిషి యొక్క మనస్సు ప్రశాంతముగా పవిత్రమై, సుస్థిరమై వుంటుంది. ఎట్టి పరాజయములకు గాని, ఎట్టి పరాభవములకు గాని, ఎట్టి కష్టములకు గాని అది యేమాత్రము చలించదు. దీనికి భగవత్ప్రేమయే ప్రధానమైన శక్తి. ఆత్మవిశ్వాసమే మానవులకు ప్రధానమైన సౌందర్యము. ఆత్మవిశ్వాసము అనంతమైన అంతర్‌శక్తి నిస్తుంది. ఇట్టి ఆత్మవిశ్వాసము నభివృద్ధి గావించుకుని ఆత్మానందము పొందే నిమిత్తమై ప్రతి మానవుడు కూడను తగిన కృషి చేయాలి.

ప్రేమ అనగా కేవలం ఫలాపేక్ష నిమిత్తమై, కొన్ని రకములైన భావములను అభివృద్ధి గావించుకొని తద్వారా కలుషితము కానటువంటి ప్రేమగా రూపొందింప చేసుకోవాలి. కారణమును పురస్కరించుకొని పుట్టినటువంటి ప్రేమ సరైన ప్రేమ కాదు. ఎట్టి కారణములు లేనటువంటి అకారణ ప్రేమను అభివృద్ధి గావించుకోవాలి. అదియే మానవుని యొక్క సహజ ధర్మము.

భగవంతుని అది కావలెనని, యిది కావలెనని యేమాత్రం ప్రార్థన చేయరాదు. కారణమేమనగా భగవంతుని యొక్క అనుగ్రహ ధనాగారమందు ఎట్టి విలువైన, ఘనమైన, దివ్యమైన వస్తువులున్నవో ఎవ్వరికి తెలియవు. తాను యేమి యివ్వవలెనని సంకల్పించుకొనునో అదికూడా ఎవరికి తెలియదు. అట్లు తెలియని

209108902

పరిస్థితిలో మానవుడు అల్పవస్తువులను, ఆట వస్తువులను కోరి తనయొక్క దివ్యశక్తిని కోల్పోతున్నాడు. కనుక తన యొక్క అనుగ్రహమునకు పాత్రుడైన భక్తునకు ఏ ఘనమైన, పవిత్రమైన, దివ్యమైన దానిని అందించునో అది ఎవరికీ అర్థము కాదు. కనుకనే మానవుడు భగవంతుని నుండి ఎట్టి అల్ప, స్వల్ప విషయముల నాశించరాదు. ప్రేమించరాదు, ప్రార్థించరాదు. అన్నింటి కంటె ఘనమైన, విలువైనది ప్రేమ. ఒకవేళ నీవు భగవంతుని ఏమైనా కోరదలచితివా అట్లు కోరునట్లైన భగవంతుడా! నీవొక్కడే నాకు చాలు అనే కోరికను కోరవచ్చు. అది ఒక్కటి వుంటే సర్వమును మనము చేకూర్చుకోవచ్చును. అందువల్లనే మీరాబాయి కూడను ప్రేమరత్నము కంటె విలువైనది యేమియు లేదని చెప్పింది. అట్టి విలువైన వస్తువునుంచుకొని కల్పవృక్షము కడకు పోయి కాఫి పౌడరు అడిగినట్లుగా వుంటుంది. కనుక భగవంతుని కోరదలచినట్లైతే తనను మాత్రమే కోరాలి గాని అన్యమైన, అల్పమైన, స్వల్పమైన కోరికలు మనం కోరరాదు. ఆ కోరునప్పుడు కూడను భగవంతుని అనేక విధములుగా వర్ణించి అతని మెప్పు పొందాలని అనేక వర్ణనలు కల్పించి మనము కోరరాదు. నీవు కరుణా సముద్రుడవు, నీవు దయాసాగరుడవు నీవు ఆపద్బాంధవుడవు, అనాథ రక్షకుడవు అని యీ విధమైన వర్ణనలన్ని భగవంతునికి విసుగు కల్గిస్తాయి. ఇవన్నీ కూడా కేవలం వ్యాపార రంగమునకు సంబంధించినవి. ఆ విధముగా భగవంతుని వర్ణించి అందుకునే ఫలములు యివి సరియైన ఫలములు కూడను కావు. ప్రాచీన కాలము నుండి మహర్షులు, యోగులు యిలాంటి వారంతా కూడను యీవిధంగా భగవంతుని వర్ణించుటకు ప్రయత్నం చేయుటం చేతనే వందల కొలది సంవత్సరములు తపస్సు చేసినప్పటికిని వారియొక్క అభీష్టములు నెరవేర్చుకోలేక పోతూవచ్చారు.

భగవంతుడు మనుష్యాకారమును మాత్రమే అభిలషిస్తూవుంటాడు. అతనిని ఒక చెలికాని వలె, మిత్రుని వలె భావించినప్పుడే అతనికి అమితమైన ప్రీతి కలుగుతుంది. ఓ ప్రియతమా! ఓ నా హృదయ రత్నమా! అనే సంబోధనల చేత అతనిని ఎంతైనా ప్రసన్నం చేసుకోగలము. అట్లు కాకుండా

వాచామగోచరుండని నీచరితములు పొగడ బ్రహ్మాదులకైన తరమా!
హే కృష్ణా కాచుకున్నాను నామొర ఆలకించి బ్రోవుమయ్యా ...|వాచా|
కొడుకు గాని పోయిన గురుపుత్రుని తెచ్చియిచ్చినావు.
కాముని మదమణచినావు వసుదేవ దేవకీ చెరను విడిపించినావు
వెలుగొంటి యైన ఆ ద్రౌపది హా! కృష్ణా యని మొరలిడ
బ్రోచినావు వేయేల పాండవులను గాచినావు.
కుచేలుని ఆర్తి దీర్చినావు
కురూపి యైన కుబ్జ వక్రములను పోగొట్టినావు.

అని వర్ణిస్తే వారిని వీరిని ఆదర్శముగా నిరూపించుకుని తనఫలమును పొందే నిమిత్తమై

209108903

భగవంతుని మెప్పిస్తున్నాడని ఇది ఒక విధమైన హాస్యాస్పదముగా రూపొందుతుంది. ఇట్టి ప్రార్థనలన్నీ కూడను కొంత అసూయా భావములకు కూడ దారి తీస్తాయి. వారికి అవి ఇవ్వబ్బవు నాకెందుకీయ కూడదు. వారితో ఈవిధంగా మాట్లాడావు నాతో ఎందుకు మాట్లాడవు. ఈ విధంగా అసూయా భావములకు చిహ్నంగా రూపొందుతుంది. ఇంతేగాక భగవంతుని ఒక అధికార స్థానంగాను అమితమైన మిత్రునిగను, సన్నిహితుడుగను భావించినప్పుడే మన యొక్క అభీష్టములు సులభంగా నెరవేరుతాయి. ఎవరిని మనం అమితంగా వర్ణిస్తాము? క్రొత్తవారిని, మిత్రుని గావించుకునే నిమిత్తమై మనం అమితంగా వర్ణిస్తాము. అతనిని గృహమునకాహ్వానించినప్పుడు కూడా రండి, దయ చేయండి, కూర్చోండి అనే ఇట్టి గౌరవములైన పదములనే అతనికి అందిస్తాము. కాని పాత మిత్రుడే వచ్చినప్పుడు రారా! కూర్చోరా అని ఈవిధమైన మాటలతో అతనిని సంబోధిస్తాము. త్యాగరాజు అనేక సాధనలు చేసి, అనేక కోట్ల జపములు ఆచరించి నిత్యత్యమైన సత్యస్వరూపాన్ని దర్శించే నిమిత్తమై తాను ఒక విధమైన సాక్షాత్కారాన్ని కూడా పొందాడు. అట్టి సాధనల చేతనే అతను సన్నిహితుడుగా చేసుకున్నాడు. అతను ఈ గౌరవ ప్రతిష్ఠలకు సంబంధించిన పదము లేమాత్రము కూడా ఉచ్చరించలేదు. అతనిని తన ఇంటికి రమ్మని కోరినప్పుడు ఈవిధంగా కోరుతూ వచ్చాడు.

రారా మాయింటి దాకా రఘువీర సుకుమార
నే మ్రొక్కెద రారా మాయింటి దాక.
రారా దశరథ కుమారా నన్నేలు కోర నే తాళలేర. ||రారా||

భగవంతుని ఎవరైనా రారా అని పిలుస్తారా! భక్తుడైన వాడు కనుకనే అతనిని ఆవిధముగా త్యాగరాజు సంబోధిస్తూ వచ్చాడు.

ఈ నవరాత్రి ఉత్సవములో పూర్ణాహుతి దినమున మనం గుర్తించవలసిన వృత్తుల తత్వాన్ని ఈరీతిగా గుర్తించాలి. కోరికలను తగ్గించుకోండి. అల్పకోరికలు కోరకండి. ఏదో ఒక ఫల నిమిత్తమై ఆశించి దానికోసం భగవత్ సన్నిధికి పోయి కాలమును వ్యర్థము గావించుకునే మార్గములో మనము ప్రవేశించరాదు. దురదృష్టవశాత్తు ఈ కలియుగమునందు ఏ క్షేత్రమునకు పోయినా, ఏ యాత్రలు చేసినా తమయొక్క తత్ఫలమును అభివృద్ధిగావించుకొని, మనసునందుంచుకొనియే యాత్రలు క్షేత్రములు దర్శిస్తూ వస్తారు. భగవంతుడే మనవశమైపోతే మనకు లభించని ఫలితము ఇంక ఎక్కడుంది? లభించని పదార్థములెక్కడున్నాయి! రామా! నీ అనుగ్రహ బలము ఒక్కటుంటే చాలు సర్వగ్రహములు కూడా నా హస్తగతమవుతాయి అన్నాడు త్యాగరాజు. భగవంతుని వర్ణించకుండా అతనిని తమ సన్నిహితునిగా భావించుకొని, ఒక మిత్రునిగా భావించి అనేక రకములుగా ప్రసన్నుని గావించుకోటం అత్యంత అవసరము. ఈ అన్నింటికి పరమ పవిత్రమైన ప్రేమ ఆధారము. కష్టములందుగాని, దుఃఖములందుగాని

209108904

విచారములందుగాని యీ స్థిరమైన విశ్వాసము మనం చలించకుండా చూసుకోవాలి.

పాండవుల యొక్క ప్రధానమైన ఆ ధర్మము ఇదియే. సభలో ద్రౌపదికి పరాభవము జరిగినప్పుడు గాని, అభిమన్యునికి అనేకరకాల కష్టములు కలిగించి ప్రాణములు తీసినప్పుడు కాని, ఉపపాండవుల యొక్క గొంతులు అశ్వత్థామ కోసినప్పుడు కాని, రాజసూయ యాగము చేసి మహాగొప్ప ఖ్యాతిని పొందిన సుఖసౌఖ్యములను అనుభవించినప్పుడు గాని, అరణ్యవాసమునందుగాని యీ కష్టములకు, నష్టములకు దుఃఖములకు వారు యేమాత్రం వెరువక, పొంగక, కృంగక కృష్ణుని యొక్క నామమును మాత్రమే నిరంతరము స్మరిస్తూ వుండేవారు. కృష్ణప్రేమ కోసం మాత్రమే వారు ఎదురు చూచేవారు. కష్టములు, దుఃఖములు యివన్నీ కదలిపోయే మేఘములు. నిజముగా తల్లి తండ్రి, భార్య బిడ్డలు యిలాంటి వారంతా ఎన్ని జన్మలనుండి మన వెంట వస్తున్నారో, ఎన్ని జన్మములలో వారికి భర్తవై పోయినావో, ఎన్ని జన్మలలో వారు నీకు భార్యలై పోయారో, ఎన్ని జన్మములలో నీకు తల్లి తండ్రులై పోయారో. ఇవన్నీ మనకు జ్ఞప్తియందున్నవా? ఇవి ఎన్ని మారినప్పటికి దైవం మాత్రం మారడు. ఒక్కటిగానే వుంటాడు. అట్టి మారని తత్వముతో మనం సన్నిహిత సంబంధము పెంచుకోవాలిగాని, మారే తత్వముతో మారే ప్రేమగానే అభివృద్ధి గాంచుతుంది.

అట్టి మారని ప్రభువు ఎక్కడా అని వెతికేటువంటి స్వభావాన్ని నిరూపించేది యజ్ఞము. యత్ + జ్ఞ యజ్ఞమవుతుంది. యత్ అనగా యీ ప్రపంచమునకు మూలాధారుడు ఎవరు అని దీని అర్థము. జ్ఞ అనగా అట్టివాడు ఎక్కడ వున్నాడని వెతకటము. సమస్త సృష్టికి మూలాధారుడైన పురుషుడెక్కడ అని వెతికే ప్రయత్నమే యజ్ఞము. ఇతే ఆయన ఎక్కడున్నవాడని వెతకటము. దీనినే వేదము మరొకతీరి ఉచ్చరిస్తూ వచ్చింది 'అంతర్ బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః' లోపల వెలుపల సర్వత్ర నిండినటువంటి వాడే భగవంతుడు. ఎక్కడ చూచినా వుండిన వానిని ఎక్కడ వెతికేది? వెతకటమెందుకు? ఇతే యీ మహాత్ములందరు కూడను యీ సమస్యను పరిష్కారం చేసే నిమిత్తమై తపస్సును గావిస్తూ వచ్చారు. కట్టకడపటికి యీ సత్యాన్ని గుర్తించుకున్నారు. 'వేదాహమేతం పురుషం మహాంతం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' అని జగత్తుకు బోధిస్తూ వచ్చారు. వేదాంతమయుడైనవాడు, మహాతేజోమయమైనవాడు ఎక్కడ వున్నాడు? సూర్యకాంతిలో మూడిన యీ పరమపురుషుడు ఎక్కడ వున్నాడంటే తమస్సు అనే తమోగుణమునకు ఆవల వున్నాడని నిరూపించింది. తమోగుణమునకు ఆవల వున్నాడు కనుక మనము యిప్పుడు విచారణ చేసి మనలో వున్న తమస్సును దూరం చేయాలి. ఈ తమస్సు అనే తెరచాటున వుంటున్నాడు. తమిళంలో కూడా చెప్పుతుంటారు పెన్న దాటితే పెరుమాళ్ళు అని. మనము యీ తమస్సు అనే పెన్నను దాటినప్పుడే యీ భగవంతుడు కనుపిస్తాడు. పాదము మొదలుకొని శిరస్సు వరకు తమోగుణము తాండవమాడుతున్నప్పుడు యిక భగవంతు

209108905

పేరతిగా మనకు లభ్యమవుతాడు.

ఏ ఒక్కదానికి త్యాగము లేదు. కొండంత ఆశలు హృదయములో పెట్టుకొని కొబ్బరికాయ కొట్టటానికి ప్రయత్నిస్తాడు దేవునికి. ఇది కాదు ప్రార్థన. ఇది కాదు భక్తి ఇది కాదు ప్రేమ. అభీష్టములను మాత్రమే శిరస్సునందుంచుకోటం సరైన ప్రార్థన కాదు. స్వార్థరహితుడైన మానవుడే సమాజసేవలో పాల్గొంటాడు. అట్టి స్వార్థరహితమైన సేవలు చేసిన వారికే భగవంతుని సేవ చేయటానికి అధికారం వస్తుంది. మొట్టమొదట మనము త్యాగేనైకే అమృతత్వమానసు ఈ త్యాగమనే దానిని కొంత వరకు అభివృద్ధిపరచుకోవాలి. ఈ త్యాగము ఒక్క ప్రేమ వల్లనే లభ్యమవుతుంది. ప్రేమ కల్గినవాడు ఏదైనా కూడా త్యాగం చేస్తాడు. ప్రేమ లేక స్వార్థము మాత్రమే నింపుకున్నవాడు ఎట్టి త్యాగమునకు ముందంజ వేయడు. భగవంతుని మనము సన్నిహితుని గావించుకోవాలంటే ఈ జగతత్త్వన్ని చక్కగా గుర్తించుకోవాలి.

భగవంతుడెక్కడో ఒకచోట మాత్రమే లేడు. నీవే భగవంతుడు. నీ ఉపాధి భేదం దూరం గావిస్తే సాక్షాత్కారము నీకే లభ్యమవుతుంది. జాగ్రదవస్థయందు మనము అనేక రకములైన అనుభూతులను అందుకుంటాము. దృశ్య కల్పితమైన జగత్తునంతా మనం అనుభవిస్తున్నాము. 19 పాదములతో కూడిన జగత్తును మనం చూస్తాము. ఏమిటి ఆ 19 పాదములు? ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, పంచ ప్రాణములు ఇవి 15. తరువాత మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము. ఇవే 19 పాదములు. జాగ్రదవస్థయందే ఈ భౌతికమైన సుఖసంతోషములు మనం అనుభవిస్తాము. ఇక్కడ మనం జాగ్రత్తగా వుంటాము. ఇట్టి జాగ్రదవస్థలో నున్న ఆత్మ తత్వానికి ఏమని చెప్పారు? విరాటు స్వరూపుడన్నారు. విరాటు స్వరూపుడనగా జగత్ స్వరూపమే. ఇతనినే విశ్వుడు అని మరొక పేరు. ఈ విశ్వుడు నుండి వచ్చినటువంటిదే విశ్వము. ఇతనినే ఇంకొక రీతిగా విచారణ చేసినప్పుడు విరాజపుత్రుడు అన్నారు. జగత్తుకు ఆదర్శప్రాయుడుగా వుండేవాడు. ఆనందాన్ని అందించేవాడు సత్ చిత్ అనే స్వరూపాన్ని నిరూపించేవాడు విరాజపుత్రుడు. ఇంక స్వప్నావస్థలోకి పోయినప్పటికి జగత్తంతయు తనకు లోనే ఆవిర్భవింప చేసుకున్నాడు. తానే అన్ని సృష్టించుకున్నాడు. సృష్టించుకొని తానే అనుభూతిని పొందుతున్నాడు. దీనినే స్వప్నావస్థ అన్నారు. ఈ స్వప్నావస్థలో తైజసుడు అన్నారు. ఇతనినే హిరణ్యగర్భుడు అని చెబుతూ వచ్చారు. అనగా సర్వమును తనయందే వుంచుకొని, సర్వము తన యొక్క సంకల్పము చేత సృష్టించేవాడు కనుక హిరణ్యగర్భుడు. మూడవది సుషుప్తి. సుషుప్తి అనగా మంచి నిద్ర. మంచి నిద్రలో యేమి అనుభవిస్తున్నాడు. తనను తానే మరచి తన్మయత్వముగా ఒక్క ఆనందమును మాత్రమే పొందుతున్నాడు. అక్కడ ప్రజ్ఞ మాత్రమే వుంటున్నది. అక్కడ ప్రజ్ఞానం బ్రహ్మ అని పుచ్చరిస్తున్నారు. జాగ్రత్తలో వున విశ్వుడు, స్వప్నములో వున్న తైజసుడు, సుషుప్తిలో వున్న ప్రజ్ఞ మూడు ఒక్కటే. ఈ

అవస్థలను మనం దూరం చేసినప్పుడు నిలిచేది ఒక్కటే. జాగ్రదవస్థలో అనుభవించినవాడూ తానే. స్వప్నావస్థలో అనుభవించినవాడూ తానే. సుషుప్తిలో ఆనందమును అనుభవించి తన్మయుడైనవాడూ తానే. ఈ మూడు అవస్థలను తీసివేసినప్పుడు అదే తత్వమసి అవుతుంది. అదే నేనుగా మారిపోతుంది. అట్టి తత్వమసి అనే భావము ప్రతి మానవుని యందు వుంటున్నది.

మనం ఎక్కడికో పోయి వెదుకనక్కర లేదు. అన్నింటికిని మనమే మూలకారణమై, మూలాధారమై, ముఖ్యమై వుండినప్పటికి మన స్వస్వరూపాన్ని మనం విస్మరించి బాహ్యప్రపంచమునందు భగవంతుని వెతకటానికి ప్రయత్నం చేస్తూ వుంటాము. ఇక ఆ వెతుకుటకు ప్రయత్నం చేసే దాని లోపల మనము ఒక పవిత్రమైన, నిర్మలమైన నిశ్చలమైన ప్రేమను మాత్రమే మనం పెంచుకోవాలి. అట్టి ప్రేమ భావంతో భగవంతుని నామమును వుచ్ఛరించండి. భగవంతునికి మానవాకారం మరింత ప్రీతికరమైనది. అందుకోసమే అవతారములు కూడా మానవావతారములుగా దిగి వస్తూవుంటాయి. కర్మమార్గమునందే మనము భగవంతుని దర్శించుటకు ప్రయత్నించవచ్చు. అందువల్లనే భగవద్గీత యందు 'కర్మణ్యేవాధికారస్తే' కర్మలయందే నీకు అధికారమంటున్నది. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' కర్మలనాచరించే నిమిత్తమై శరీరము వచ్చింది. 'కర్మానుబంధీని మనుష్యలోకే' ఈ జగత్తంతా కూడా కర్మతో బంధింపబడింది. అలాంటి భగవంతుని మనము ఏదో కృత్రిమమైన వేషాలు కట్టి అతనికి అనేక విధములైన అలంకారములు చేసి అతనిని ఒక బొమ్మవలె మనం అనుభవిస్తున్నాము. ఇది కాదు భక్తికి మార్గము. సహజస్వరూపాన్ని సహజంగానే మనము అనుభవించాలి. భక్తులకు తృప్తి కావచ్చుగాని యీ అలంకారము భగవంతునకు తృప్తి కాదు. భక్తుల యొక్క మనస్సు కరుగవచ్చును గాని భగవంతుని యొక్క హృదయము కదలదు. ఒక్క ప్రేమ చేతనే హృదయాన్ని కరిగించి కదిలింపచేయుటానికి తగిన శక్తిసామర్థ్యములుంటున్నవి. కనుక భగవంతుని అమితంగా వర్ణించటానికి ముందుకు పోకుండా కేవలము అల్పకోరికలు మనం కోరకుండా అతనినే మనము కోరితిమంటే అన్నీ లభ్యమవుతాయి. కనుక భగవంతుని నామస్మరణ చేస్తూ మన యొక్క మిత్రునిగను, సన్నిహితునిగను చేసికోటానికి తగిన ప్రయత్నము చెయ్యాలి.